# 'బంగారు'

గట్టిగా గాలి వీచితే పడిపోతుందా యిల్లు, కాని అంతకంటే గట్టి పునాదులతో ఇల్లు కట్టుకోవడానికి అనువైన చోటు ఆ ప్రాంతం కాదు. ఆ సరిహద్దుల్లో నిర్మించిన ఇళ్ళన్నీ తేలికగా ఉండి తీరవలసిందే; భూమి లోపల కొన్ని మైళ్ళ మేర ఖాళీగా ఉంటుంది. ఆ పాతాళంలో అనుదినం వేలాది కార్మికులు పనిచేస్తుంటారు. ఆ లోకానికి వెడుతున్నవారికి ప్రాణాల మీద తీపి ఉండదు. ఉండ నవసరమూ లేదు "ఎక్కడున్నా ప్రాణం పోదనే హామీ మాత్రం ఉంది ఏడ్చింది ఈ లోకంలో" అంటుంది బంగారు.

బంగారు అక్కడి పనిలో చేరి పది సంవత్సరాలు పూర్తి కావచ్చినై; ఈ ఉగాదికి పదకొండో సంవత్సరం పుడుతుంది. ఆమె వయస్సు ఇరవై ఏడు. ఐనా ఆమెలో జవసత్వాలు తగ్గలేదు ఇద్దరు పిల్లలు, భర్త ఈ చిన్న కుటుంబమే ఆమె సర్వస్వం.

పదేళ్ళకు ముందు బంగారు కొన్ని బంగారు స్వప్నాలు కంటూ వచ్చింది. ఆ స్వప్నాలను యదార్థం చేసుకోవడానికి ఆమె బంగారు గనుల్లో కూలీగా ప్రవేశించింది. ఆమె అలాగా వలస వెళ్ళడానికి ఒక చిన్న కారణం ఉంది. ఆ సంఘటన ఎంతో స్వల్పమైనదైనా ఆమె జీవిత పథంలో అదొక అడ్డుదారిని త్రొక్కించింది,

బంగారు పుట్టిన గ్రామం పేరు కూడా బంగారు పాళెమే. ఆమె నాన్నగారు ఒక చిన్నరైతు. స్వంతం పొలం లేకున్నా అతణ్ణి రైతనే అంటుంటారు. కౌలుకు దాదాపు నాలుగు ఎకరాల పొలాన్ని సేద్యం చేస్తుండే వాడు. ఎంత కష్టపడినా పంటలో సగం భూస్వామికి పంచి ఇవ్వడంతో అతని క్షేమాత్రం గిట్టేది కాదు,

ఆ ఫలితం కుటుంబ పోషణకే సరిపోతుండేది. అతనిలో వేదాంత ధోరణి ఎక్కువ. ప్రతి సంవత్సరమూ అందిన పంటలో కొంత భాగాన్ని మొగిలీశ్వ రునికి అర్పించేవాడు. మరికొంత భాగాన్ని అమ్మి డబ్బు చేసుకొని ఏదో ఒక క్షేత్రానికి యాత్ర వెళుతుండేవాడు. ఈ స్థితిలో బంగారు పుష్పవతి ఐంది ఆడబిడ్డలకు సహజంగా ఆభరణాలమీద ఆకర్షణ ఎక్కువ. ఈ మోజు యుక్త వయస్సులో మరీ ఎక్కువగా కన్పిస్తుంటుంది. ఇంట్లో నగలు లేకపోయినా ఇరుగుపొరుగువారు తమ తమ భూషణాలను తెచ్చి ఆ సమయంలో అలంకరి స్తుంటారు.

బంగారును గృహ ప్రవేశం చేయించిననాడు తండ్రి రత్తయ్య యాభైరూ పాయలవరకూ ఖర్చుపెట్టారు ఆ మొత్తం అతని శక్తికి అతీతమనే చెప్పాలి. ఆ రోజున బంగారుకు కృష్ణుని వేషం వేశారు. పట్టుచీరెను పంచెకట్టు కట్టి నడుముకు సరిగంచు దట్టీవలె అంగవస్త్రాన్ని చుట్టారు. కొండముడిమీద నెమలి పింఛం మెరసిపోతుంటే సాక్షాత్తు శ్రీ కృష్ణుడే అవతరించినట్లు కనబడిందామె, వేషం. ఆ రోజున ఇరుగు పొరుగున ఉన్నవారందరూ తమ తమ ఆభరణాలను తీసి ఆమెకు అలంకరణ చేశారు. కాని మూడో యింటికి కొత్తగా వచ్చిన కోడలు పక్కాబాయిమాత్రం అడిగినా తన ఎర్రరాళ్ళ కమ్మల్ని యివ్వనన్నది: మును పొకసారి ఎవరికో యిచ్చి ఆ ఎర్రరాళ్ళ వెందుకూ నూనె దిగిపోయిందట. మళ్ళీ ఆ నూనెను తీయించడానికి డబ్బు దండుగ కావడంతోపాటు వాటి స్వరూపమే చెడిపోయిందట. ఆ రోజు అనుకొన్నది బంగారు తానూ ఎర్రరాళ్ళ కమ్మలొక జత కట్టించుకోవాలని.

ఆ ఉత్సవం జరిగిపోయింది. ఆ మరునాడు ఎవరి నగలు వారు ఒలుచు కొనిపోయారు. ఏ ఆభరణాలూ లేని బంగారు నామమాత్రంగా నిలిచిపోయింది. తన కోరికను నాన్నగారికి చెప్పింది. రత్తయ్య ఆలోచించి ఈ సంవత్సరం పంటలో తప్పకుండా ఒక జత ఎర్రరాళ్ళ కమ్మలు చేయించి పెడతానని మాట

యిచ్చాడు. అందుకోసం ఒక ఎకరా చెరకు పైరు ప్రారంభించాడు. అదృష్టం మంచిదై పంట పండితే బెల్లం ధరకొంచెం పెరిగితే కమ్మలే కాదు – కాసుల దండనే చేయించుకో వచ్చు.

కానీ ఆ సంవత్సరం చెరకు పంట చెడిపోయింది. ఆ కర్రలు కాకి వెదురు బుర్రల్లాగా సారం లేకుండా ఎండిపోయినై. చివరి కా బెల్లం నలుపు తిరిగినా ముద్దగానైనా నిలుపక పోయింది. వంద క్రొత్త కడవలు కొని ఆ ద్రవాన్ని నిలువ చేయించాడు ఆదాయం మాట దేవు దెరుగును కాని అసలుకే మోసం వచ్చింది. భూమిగల్ల రైతైనా తట్టుకోలేని పరిస్థితుల్లో గుత్తకు చేసే రైతుగుండెలు జారవిడుచుకొంటాడు,

ఉన్నకాడి గిత్తలను అమ్మి అప్పుకట్టేశాడు రత్తయ్య. అప్పుడు చెప్పింది బంగారు చక్కని ఆలోచన, సక్కుబాయి అన్నలిద్దరూ బంగారు గనుల్లో పదారు సంవత్సరాలనుండి పని చేస్తున్నారనీ చాల సంపాదించారని, అంచేతనే సక్కుబాయికి ఒంటి నిండా నగలు చేయించి పెళ్ళిచేశారని. అక్కడికి వెడితే బ్రతుకు సులభంగా సాగిపోతుందనీ సలహా చెప్పింది.

రత్తయ్య ఒకటి రెండు రోజులు ఆలోచించాడు. కౌలుకు చేసే రైతుకు ఆస్తి ఎద్దులు మాత్రమే వాటిని పోగొట్టుకొన్నాక కూలి చేయవలసిందే పల్లెలలో ప్రతి రోజూ కూలి దొరుకుతుందనే హామీ లేదు. దొరికినా రైతుల దయాదాక్షిణ్యంమీద ఆధారపడే ఉండాలి. తానూ ఒక రైతుగా బ్రతికినవాడు చెడిన వెనుక స్వస్థలంలో కంటే అన్య ప్రాంతంలోనే జీవితాన్ని సాగించడం సులభం.

ఆ మరునాడే తన పూరి పాకను బేరం పెట్టాడు, నలభై ఐదు రూపాయలకు అమ్మివేశారు. బంగారును; పిలుచుకొని బంగారు పాళెం విడిచి బంగారు గనుల్లో కూలీగా ప్రవేశించాడు,

తొలి రోజుల్లో ఎంతో ఉత్సాహంగా పనిచేశాడు. ఏడాది కంతా బంగారుకు కూడా పని దొరికింది. జీవితం క్రొత్త అనుభవం క్రొత్త ఆకాశం పందిరి క్రింద భూదేవత ఒడిలో ఆడుకొనే పసిబిడ్డవలె పొలంలో పనిచేసే బంగారు పాతాళంలో ప్రవేశించింది. ఐనా ఉత్సాహం తగ్గలేదు. ఒక్కొక్కసారి భూమిపైన విరిగి పడుతుందేమో నని భయపడుతుండేది. కానీ భగవంతుడున్నాడులే అని మొండి ధైర్యంతో గుండెలు చిక్కబట్టుకొని పని చేస్తుండేది

ఇద్దరూ మూడు సంవత్సరాలు పనిచేశారు. ఆ నాలుగు చేతులూ ఎన్ని మణుగుల బంగారాన్ని త్రవ్విపోశాయో లెక్కలేదు కానీ రెండువందల రూపాయలను మిగులబెట్టారు, వంద రూపాయలతో ఎర్రరాళ్ళ కమ్మలు కట్టించుకోవాలనీ వంద రూపాయలతో పెళ్ళిఐందని అనిపిస్తే చాలని రత్తయ్య అంచనా వేసుకున్నాడు. కమ్మలు కట్టడానికి డబ్బు యిచ్చి ఇంటికి వచ్చారు. ఇంతలో ఎన్నో సంవత్సరాలనుండి నీ కోసమే కాచుక్కూచున్నా నన్నట్టు వచ్చి పట్టు కొన్నది మలేరియా, ఆ వెనుక మరేదో అజీర్తి రోగం, ఆ మీద అత్యంత తీవ్రమైన కడుపునొప్పి, చేతనున్న వంద రూపాయలు ఖర్చయిపోయినై. కమ్మలు కట్టించినవి చెవుల్లో పెట్టుకొనే యోగం రాకమునుపే అమ్మివేయవలసిన పరిస్థితులు వచ్చాయి బంగారు ఏ మాత్రం చింతించలేదు. ఆమెకు ఎర్రరాళ్ళ కమ్మలు పెట్టుకోవాలని మోజు ఉన్నది అందుకోసం ప్రతి రాత్రీ ఆమె కలలు కంటూ ఉంటుంది. ఆ కమ్మలను పెట్టుకొని తాను అద్దం ముందు నిల్చున్నట్టు ఆ ప్రతి బింబంలో ఆ రాగ రంజిత భూషణాలు వెలుగు లీనుతున్నట్టు. ఎవరో అపరిచితుడైన ప్రియుడు బహూశా భవిష్యత్తులో తనకు మాంగల్య ధారణం చేయబోతున్న భర్త వెనుక వెనుకే వచ్చి చిరునవ్వులను చిల్కించి నట్టు మధుర స్వప్నాలను కంటుండేది.

నాన్నగారి ప్రాణంకంటే ఈ కమ్మ లెక్కువ కావని ఆమెకు తెలుసు రత్తయ్య బ్రతికివుంటే రత్నహారమే చేసుకొన్నంత ఫలితం. భగవంతుడు కనికరించాడు.

ఆ కమ్మల నమ్మిన పైకంతో మంచి డాక్టరుగారి దగ్గర ఆపరేషన్ చేయించింది. కడుపునొప్పి నిలిచిపోయింది కానీ నీరసం తగ్గలేదు. అసలు పనిలోకి వెళ్ళరాదని డాక్టరుగారు ఖచ్చితంగా చెప్పివేశారు.

బంగారు అధైర్యం పడలేదు. ఆమె చిన్నతనంలో ఉన్నా ఎంతో ధైర్యవంతురాలు. భవిష్యత్తు భయావహంగా కన్పించినా అదేమంత నిరాశాపూరితం కాదని ఆమె అనుకొన్నది. ఆమె శక్తిమీద ఆమెకు ఎక్కువ నమ్మకం. నాన్నగారిని ఇంట్లోనే ఉంచి ఆమె పనికి వెళ్ళడం ప్రారంభించింది. ఆడబిడ్డ రెక్కల కష్టం మీద బ్రతకడం రత్తయ్యకు ఇష్టంకాకున్నా అది తప్పని పరిస్థితిగా ఏర్పడింది అనుకోని విధంగా మధ్యవయస్సులోనే వృద్ధాప్యం వచ్చిపడింది. తల పండిపోయింది. ఎముకలు వంగిపోయాయి కండలు చిక్కిపోయాయి. చర్మం ముడతలు పడిపోయింది. సందేహంలేదు. తాను ముసలివాడైపోయాడు.

బంగారు ఉత్సాహంతోనే నిత్యం గనిలోకి దిగుతున్నది. ఆమె కష్టార్జితంతో బ్రతుకుతున్న రత్తయ్యకు ఆమెనో యింటిదానిగా చెయ్యాలనే ఆకాంక్ష ఎక్కువైపోయింది.

అలాంటి పరిస్థితుల్లో ఆకుటుంబంలో ప్రవేశించాడు: ముత్యాలు ఆకారంలో చాలా ముచ్చటగానే ఉంటాడు. చామన చాయ. వెదురు బద్దలటోపీ పెట్టుకొని కాకీ పాంటు తొడుక్కొని తెల్లని బనీను వేసుకొని నడిచిపోతుంటే ఓ చిన్న దొరలాగా ఉంటాడు. అతడు బంగారును రోజూ చూస్తూనే ఉన్నాడు. ఐనా పల్కరించలేదు. ఓనాడు అప్రయత్నంగా రత్తయ్యతో మాట్లాడాడు. మాటల సందర్భంలో ఇద్దరూ ఒకే కులానికి చెందినవారని తెలిసిపోయింది. అంతకంటే ఆశ్చర్యమేమంటే ముత్యాలు రత్తయ్యకు చాల దూరపు బంధువు. ముత్యాలు స్వగ్రామం పెద్దకాల్వ. రత్తయ్య చిన్న తాతగారి బావమరది కుమార్తెను పెద్దకాల్వలోనే యిచ్చాడు. ఆమెకు తోడుకోడలు మనుమడు ముత్యాలు. ఏదో కాస్త కలిసివ

సంబంధం. ఈ యథార్థం బయట పడ్డాక రత్తయ్య ముందు వెనుకలు ఆలోచించ కండా బంగారును అతని కివ్వడానికి అంగీకరించాడు. ఈ సంబంధానికి బంగారు కూడా ఒప్పుకొన్నది కానీ ఆమె ఒక షరతును పెట్టింది. "నాకే నగలూ అవసరంలేదు. ముక్కుపుల్లలు మనమే చేయించుకొందాము. ముహూర్తం చీరె కూడా అంత ఎక్కువ ఖరలో ఉండాలని నేను కోరను, అది ఏ పాతిక రూపాయలైనా ఫరవాలేదు కానీ ఎర్రరాళ్ళ కమ్మలు మాత్రం ఒక జత ఇచ్చితీరాలి" అన్నది.

"ఎంత అమాయకపు పిల్ల!" అనుకున్నాడు రత్తయ్య, ఆ ఒక్క జత కమ్మలు చేయించి పెట్టలేని తన అసమర్థతకు తానే సిగ్గుపడ్డాడు. ఆవేదన పడ్డాడు. ఆ మరునాడు ముత్యాలు కలుసుకొన్నప్పుడు ఎర్రరాళ్ళ కమ్మల విషయం చెప్పాడు. అతడెంతో సంతోషంతో అంగీకరించాడు.

ఒక శుభ ముహూర్తాన వివాహం శాస్త్రీయంగా జరిగిపోయింది. బంగారు తన చెవుల్లోని ఎర్రరాళ్ళ కమ్మలు అద్దంలో ఎలా మెరిసిపోతున్నాయో చూచుకొని అమితమైన ఆనందాన్ని అనుభవించింది. ఆ ఎర్రని బుగ్గలమీద అరుణ రాగాల నిగనిగలు ప్రతిఫలిస్తుంటే "మా యిమ్మి సాక్షాత్తు లక్ష్మీదేవి!" అని తనలో తాను వందమార్లు అనుకొన్నాడు రత్తయ్య.

ముత్యాలు బంగారు ఇంటిలోనే కాపురం పెట్టాడు. ఇద్దరూ ఆనందంగా పనిలోకి వెడుతున్నారు. ముసలాడు వారి దాంపత్యాన్ని చూచి మురిసిపోతున్నాడు. ఇలాగా మూడు వారాలు గడిచిపోయాయి నాలుగో వారంలో ఒకనాటి సాయం కాలం ముత్యాలు బంగారు దగ్గర కూర్చుని ఆ ఎర్రరాళ్ళ కమ్మలు తీసి యిమ్మన్నాడు ఆమె బదులు చెప్పకుండా తీస్తూ ఎందు కన్నట్టు చూచింది, అది ఎరువు నగట. ఒక్క నెల వాడుకోడానికి అద్దె ఐదు రూపాయలు యిచ్చే షరతు మీద తెచ్చినట్లు చెప్పాడు: పల్లెలో ఎరువు నగలిస్తారు కానీ వాటికి బాడుగ లుండవు. పట్టణాలలో కట్టు బట్టలు, తినే కంచాలు కూడా అద్దెల కిస్తారను కొన్నది బంగారు.

ఆమె అధైర్య పడలేదు. దిగులుపడటం ఆమె స్వభావం కాదు. నిరుత్సాహపడటం ఆమె జీవితంలోనే లేదు. ఆమె అర్థం చేసుకొన్నది, జరిగిపోయినందుకు చింతించి లాభం లేదు. పైగా ఏనాడైతే ముత్యాలు తన బొటన వ్రేలు త్రొక్కి మెడలో పుస్తె కట్టాడో ఆనాడే తాను అతని సొత్తయిపోయింది. ఈ ఎర్ర రాళ్ళ కమ్మల కోసం భర్తతో నిష్ఠూరా లాడటం మంచిది కాదనుకొన్నది.

"నీ వేమీ భయపడకు. ఇంకో మూడు మాసాల్లో తప్పక చేయించి పెడుతాను" అన్నాడు ముత్యాలు

"మూడు మాసాలు కాకుంటే ఆరు మాసాలకు చేసుకొందాం. ఎరవలి నగ బరువుకు చేటు ఆదీపోతే అప్పుకు చేటు" అంటూ అతని చేతిలో పెట్టి "ముందు సొమ్ముగల్లవారికి సొమ్మను చేర్చిరండి" అన్నది. ముత్యాలు ఆశ్చర్య పడ్డాడు. అతడు రెండు నిమిషాలు ఏమీ మాట్లాడలేదు. ఆ తర్వాత మనస్సులో అనుకొన్నాడు. "బంగారు నిజంగా బంగారు!"

ఈ మాటలను తనలో తానే అనుకొంటూ ఆ కమ్మలను తీసుకవెళ్ళి యిచ్చివచ్చాడు.

ఈ విషయం రత్తయ్యకు తెలిస్తే కోప్పడుతాడని బంగారు ముందుగానే హుషారు పడింది. ఆమెలోని సహనాన్ని గుర్తించిన రత్తయ్య "ఎంత అమాయకురాలు నా బంగారు!" అనుకొని లోలోపలే ఆవేదన పడ్డాడు,

మూడు మాసాలు గడిచాయి, డబ్బులు మిగల్లేదు. దీనికి ఒక ప్రత్యేక కారణం ఉంది ఎంతో ప్రయత్నం మీద బంగారు కనిపెట్టింది, ముత్యాలు త్రాగు తున్నాడు. పెళ్ళి కాకముందు స్వేచ్ఛగా త్రాగేవాడు, ఇపుడు దొంగ తనంగా త్రాగుతున్నాడు. ఈ త్రాగుడు నుండి భర్తను రక్షించుకోవాలని బంగారు ఎన్నోవిధాలుగా ఆలోచించింది, చివరికి రాత్రింపగళ్ళు అతణ్ణి వదలిపెట్టకుండా

ఉంటూ ఆ త్రాగుడుకంటే తన సామీప్యమే మధురమైనట్లు అతణ్ణి బంధించి వేసింది. ఈ విషయమే రత్తయ్యకు తెలియదు. త్రాగుడుకు అలవాటు పడిన వాళ్ళు మానుకోవడం మహాకష్టమని ఎందరో అంటుంటారు. కానీ బంగారు మాత్రం ముత్యాలు వద్దనుండి ఆ దుర్గుణాన్ని దూరం చేయగల్గింది

ఒక సంవత్సరం దొర్లిపోయింది, ఇపు డా కుటుంబములో ముగ్గురూమంచి వారైపోయారు ఒకరికంటే ఒకరు మంచివారు, ఒకరికోసం ఒకరు ప్రాణాలు యివ్వగల్గినంత మంచివారు ఈ ముగ్గురికీ ఒక పెద్దకోరిక ఇంకా అట్టే నిలిచి పోయింది, ఎఱ్ఱరాళ్ళ కమ్మలొక జత చేయించాలనే కోరిక.

ఇంతలో బంగారు పనినుండి నిలిచిపోయింది, రెండు మాసాలు సెలవు మంజూరైంది, సుఖ ప్రసవమే, బంగారంలాంటి మగబిడ్డ, ముత్యాలు ఎంతో మెలకువతో సేకరించిన యాభై రూపాయలకు తోడు మరో ముప్పై అప్పుచేసి ఎఱ్ఱరాళ్ళ కమ్మలు చేయిస్తానన్నాడు కానీ బంగారు అంగీకరించ లేదు, బిడ్డకు బంగారు గాజులు చేయించాలని పట్టుబట్టింది, పురుడు ఖర్చులుపోను మిగిలిన ముప్పైతోనూ సన్నని ఆకు పల్చని గాజులు చేయించాడు ముత్యాలు.

రత్తయ్య తనలో తాను నవ్వుకున్నాడు: "ఎంత అమాయకురాలు నా బంగారు; ఆమెలో కోరికలు నశించాయి. ఇంటి పెద్దదైపోయింది, ఇంక తన బిడ్డలను అలంకరించు కోవడంలోనే ఆనందం తృప్తి" అను కొన్నాడు,

కానీ బంగారులో మాత్రం ఎఱ్ఱరాళ్ళ కమ్మలమీద ఏ మాత్రం ఆశతగ్గి పోలేదు. చిల్లులు పడ్డట్టు కన్పిస్తే బాగుండదని చెవులకు బెజ్జాకు పెట్టుకొన్నది, నిజానికి బంగారుకు ఆ రంగు తాటాకు గూడా ఒక క్రొత్త అందాన్ని యిస్తున్నది

ఒకనాడు ముత్యాలు అన్నాడు:

"మనం ఇంతవరకూ ఈ గనిలోనుండి ఎంత బంగారాన్ని త్రవ్వి బయటకు తెచ్చామో లెక్కలేదు, కానీ నీ ఒంటిమీద గురిగింజంత బంగారు లేకపోయింది."

బంగారు నవ్వుతూ అన్నది: "నేనే బంగారు. నా కెందుకు బంగారు. నా కున్న ముత్యాలేచాలు!" అని.

ఈ మాటలు విన్న రత్తయ్య పకాలుమని నవ్వాడు. "మీ నాన్నగూడా రతనాలే. ఆయన నవ్వితే రతనాలు రాలుతాయి" అన్నది బంగారు.

బంగారు జీవితంలో మరో వసంతం గడిచి పోయింది. కన్నకొడుకు మాణిక్యానికి మూడేళ్ళు నిండగానే మరో పువ్వుపుట్టింది. ఆ బిడ్డ పేరు అపరంజి. ఆ కుటుంబంలో నామమాత్రంగా రత్నాలు ముత్యాలు అపరంజి, మాణిక్యం, బంగారం ఉన్నాయి కానీ బంగారు ఒంటిమీద బంగారు లేదు. ముత్యాలు మెడలో ముత్యాలహారం లేదు. రత్తయ్యకు ఏ రత్నాభరణమూ లేదు. మాణిక్యానికే మకుటమూ లేదు. అందులో ఎలాంటి మాణిక్యమూ లేదు. అపరంజికి అలాంటి అభరణాలూ లేవు. సొమ్ములు లేకపోయినా బంగారుకు అభరణాలమీది వ్యామోహం ఈ పేర్ల మూలకంగానైనా కొంతకు కొంత తీరుతుందేమో చెప్పలేము.

బంగారు జీవితంలో ఉన్నట్టుండి ఒక విఘాతం వచ్చిపడింది. రత్తయ్య ఒకనాడు ఆకస్మాత్తుగా ప్రాణాలు విడిచాడు. అతడు చనిపోవడానికి కారణం బహు విచిత్రంగా ఉన్నప్పటికి అది అసహజమని ఎవ్వరూ అనలేరు. తాంబూలం నోటి నిండుకూ ఉన్నసమయంలో పొరపోయింది. అతడు ఒక్క నిమిషం తన్నుకలాడి తేలకళ్ళువేశాడు. బంగారు గుండెలు పగిలిపోయాయి, ఈ సంఘటనతో ఆమె పూర్తిగా వేదాంత ధోరణిని అలవరచుకొన్నది. మూడో నెల గర్భంతో ఉన్నది, ఈ మారు ఆడుబిడ్డ పుట్టినా మగబిడ్డ పుట్టినా రత్నం అని పేరు పెట్టుకోవాలని అనుకొన్నది. ఈ మారు పెట్టుకొనేపేరు రత్నంమీది వ్యామోహంతో మాత్రం కాదు. రత్తయ్యమీది వ్యామోహంతో, ఆమెకు ఆభరణాలమీది వ్యామోహం పూర్తిగా తొలగిపోయింది. ఇద్దరు బిడ్డలూ రెండు భూషణాలు కాగా

ముత్యాలు ముత్యాల హారంగా తన జీవితాన్ని నెట్టుకపోవా లనుకొన్నది. ఇంత వైరాగ్యాన్ని పెంచుకొన్నా ఆడపుట్టుక గనుక అప్పు డప్పుడూ ఏ పెండ్లికో, ఏ దేవరకో నలుగురు పేరంటాండ్రు ఒకచోట చేరినపుడు వారి చెవుల్లోని రవ్వల కమ్మల తళ తళలను, ఎర్రరాళ్ళ కమ్మల నిగ నిగలను చూచినపుడు తన చెవ్వుల్లో తాటాకులను తడుముకొంటుంది. ఒక్కసారి తనకు తెలియకనే కన్నీటి చుక్కలు చెక్కిళ్ళపై జాలువారు తుంటాయి. ఆ వెంటనే మేలుకొంటుంది "ఎంత పిచ్చి దాన్ని. వేలమణుగుల బంగారాన్ని ఈ రెండు చేతుల మీదుగా పాతాళంనుండి పైకి తెచ్చిపెడుతున్నాను. ఆ బంగారంతో లక్షలాది కమ్మలు కట్టించవచ్చు కానీ రవ్వంత బంగారమైనా నా ఒంటిమీద నిలుపుకొనే యోగం లేకపోయింది, ఇకమీదట మాత్రం ఉంటుందనుకోవడం ఎంత భ్రమ! అసలు నా కెందుకీ భూషణాలు ఎటూ అర్థాయువు అయ్యేపోయింది. ఆ కసుగందులను పెంచుకోగల్గితే అదేచాలు" అని తన్ను తానే ఓదార్చుకొంటుంది.

బంగారు జీవితంలో ఎన్ని వసంతాలు జరిగినా, మరెన్ని పుష్కరాలుగడిచినా ఎర్రరాళ్ళ కమ్మలను చేయించుకోగల్గిన పరిస్థితులు కల్గుతాయనిమాత్రం ఎవ్వరూ చెప్పలేరు. ఏ జోస్యుడైనా చెప్పగలడేమో కానీ దానికైనా ఆమె జాతకంలేదు. కానీ ఒక్కటి మాత్రం చెప్పవచ్చు. ఆమెకు బంగారు అభరణాలు లేకపోయినా ఆమె పేరే బంగారు. ఆమె పుట్టింది కూడా బంగారు పాలెంలోనే, ఆమె పని చేస్తున్నదీ బంగారు గనుల్లోనే ఆమె ప్రియుడా ముత్యాలు. ఆమె జనకుడే రత్నాలు, ఆమె ముద్దుల పంటలు మాణిక్యం. అపరంజి, అంతే చాలు బంగారు కేం బంగారు,

('బంగారు' కథాసంపుటి నుండి సేకరణ)